

రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా
మోదీ పాలన



- బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి
- సెప్టెంబరు 1నుంచి 7వరకు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు
- విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- హనుమకొండలో రెండో రోజు సాగిన కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు

7 లో..

మామునూరు విమానాశ్రయంలో ఏఏఐ సర్వే విమానాలు (ఫైల్)



భూసేకరణే అడ్డు!

మామునూరు విమానాశ్రయానికి భూమి కోసం ప్రభుత్వం కసరత్తు



- ఇప్పటికే 700 ఎకరాల అప్పగింత.. మరో 300ఎకరాలు అవసరమని గుర్తించిన ఏఏఐ
- ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల రైతులతో అధికారుల చర్చలు
- భూమికి బదులు భూమి లేదా మార్కెట్ రేటు ఇవ్వాలంటున్న అన్నదాతలు
- నష్టపరిహారం చెల్లింపుపై స్పష్టత ఇవ్వని సర్కారు
- ఇప్పటికే మామునూరులో స్కై అండ్ ల్యాండ్ సర్వే పూర్తి
- 150కిలోమీటర్ల నిబంధన సడలింపుపై 'జీఎంఆర్'తో ప్రభుత్వం చర్చలు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ విమానశ్రాయానికి భూసేకరణే ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టు కోసం 700ఎకరాల భూమిని అప్పగించగా, మరో 300ఎకరాల భూమిని కేటాయించాలని ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రభుత్వాన్ని కోరింది. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్న ప్రభుత్వం.. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. అయితే భూమికి బదులు భూమి ఇవ్వాలని లేదంటే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరను చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.1కోటి నుంచి రూ.2కోట్లకు పైగా ధర ఉంది. దీంతో ప్రభుత్వం రైతులకు చెల్లించే నష్టపరిహారం విషయంలో స్పష్టత ఇవ్వకపోవటంతో ఎయిర్‌పోర్టుకు భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారిందనే చర్చ జరుగుతోంది.

ఎయిర్‌పోర్టుకు సర్వేలన్నీ అనుకూలమే..

2017 ఏప్రిల్ 27న ఉడో దేశ్‌కీ ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద వరంగల్ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఓఎల్ఎస్ సర్వే, సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గత 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతోపాటు మరోసారి గత ఏప్రిల్‌లో ఏఏఐ అధికారులు ఓఎల్ఎస్ సర్వేతో పాటు మట్టి పరీక్షలు నిర్వహించారు. మూడు విమానాలతో ఎయిర్ వ్యూ చేపట్టారు. విమానాల రాకపోకలకు వాతవారణం అనుకూలంగా ఉందా లేదా అని పరి శీలించారు. జియాజికల్ సర్వేతో పాటు స్కై అండ్ ల్యాండ్ సర్వే చేపట్టారు. సుమా రు రెండు వా రాల పాటు ఏఏఐ సిబ్బంది మామునూనులోనే మకాం వేసి ఎయిర్ పోర్టు నిర్వహణకు కావాల్సిన అన్ని టెస్టులను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు. ఇక హైదరా బాద్ వి మా నా శ్ర య ా న్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పదం మేరకు 150కి.మీ పరిధిలో 2038 వరకు మరో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు మామునూరు 145కిలో మీటర్ల లోపే ఉంది. ఈ నిబంధనల సడలింపుపై ప్రభుత్వం అభ్యర్థన మేరకు జీఎంఆర్ నుంచి సానుకూలత వచ్చిందని సమాచారం.



అంతర్జాతీయ స్థాయి విమానాలకు అనుకూలంగా...

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది వరంగల్ ఎయిన్ పోర్టు పరిస్థితి. అన్ని రకాల అనుమతులు, అనుకూలతలు ఉన్నప్పటికి ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఏదో ఒక అడ్డంకి ఎదురవుతోంది. గత ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ప్రయత్నాలు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన మరో 438 ఎకరాల భూమితో పాటు రూ.1,200కోట్ల నిధులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఏఐ

మిగతా 7వ పేజీలో..

రైతులతో చర్చిస్తున్నాం..

రేవూరి ప్రకాష్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే



మామునూరు ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని ఇచ్చేందుకు రైతులతో చర్చలు జరుపుతున్నాం. ఇప్పటికే సంగెం మండలంలోని పలు గ్రామాల్లో సభలు నిర్వహించాం. భూమికి బదులు భూమి కావాలని రైతులు కోరుతున్నారు. లేదంటే బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని అడుగుతున్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వరంగల్ వాసులకు గగనయానం సాకారం అవుతుందనే నమ్మకం ఉంది.

ఆర్వోఆర్ చట్టం రూపకల్పనపై ప్రజాభిప్రాయ సేకరణ

- నూతన ఆర్వోఆర్ కమిటీ చట్టం సభ్యుడు భూమి సునిల్



సమావేశంలో మాట్లాడుతున్న భూమి సునిల్

మహబూబాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం చేపట్టబోయే నూతన ఆర్వోఆర్ చట్టం రూపకల్పన కోసం ప్రజలు, రైతులు, సీనియర్ అధికారుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు నూతన ఆర్వోఆర్ కమిటీ చట్టం సభ్యుడు భూమి సునిల్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్‌టొప్పో, డేవిడ్, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌తో కలిసి శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ప్రజాభిసేకరణ చేపడుతామన్నారు. అందులో భాగంగానే శుక్రవారం మహబూబాబాద్ జిల్లాలోని కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. రైతుల సౌకర్యార్థం ఈ నూతన చట్టం రూపొందిస్తామని, గతంలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లు, సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రతీ గ్రామానికి సంబంధించిన భూమి హక్కుల రికార్డు తయారు చేయడం, దాని ద్వారా రైతులకు వివిధ రకాల సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. ఏ సమయంలో.. ఏ విధంగా.. భూమి కొనుగోలు, తదితర విషయాలకు సంబంధించి వివరాలు ఎప్పటికప్పుడు రికార్డులో నమోదు చేయడం లాంటి అంశాలను రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి సభ్యులుగా, రెవెన్యూ మంత్రితో కలిసి నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.

మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం 80శాతం వరకు జిల్లాలో భూ సమస్యలు ఉన్నాయని, వాటి యొక్క పరిష్కారం నూతన చట్టం ద్వారా అమలు జరుగుతుందన్నారు. కేసముద్రం మండలం నారాయణపురం, మహబూబాబాద్ మండలం కంబాలపల్లి, గూడూరు మండలం సీతానగరంలలో ముఖ్యమైన భూ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సునిల్‌కు విజ్ఞప్తి చేశారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. నూతన చట్టంపై వర్క్‌షాప్ సమావేశం నిర్వహించడం జరిగిందని, జిల్లాస్థాయిలో వచ్చిన అభిప్రాయాలను రాష్ట్రానికి నివేదించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులు వివిధ వర్గాల ప్రజలు నివేదిస్తూ ఈ చట్టం ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణ చేయాలని, వివిధ ముటేషన్లలో వేరుగా పడిన భూములను విభజించాలని మండలాల వారీగా రెవెన్యూ అధికారులు, సర్వేయర్లను నియమించాలని కొందరు సూచనలు చేసినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ పవర్ ప్రజేంటేషన్ ద్వారా రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

సమావేశంలో తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు, న్యాయవాది సురేష్, రైతులు ఏనుగు వెంకట్‌రెడ్డి, మల్లయ్య, బోడ రమేష్, ఐలుమల్లు, మార్నేని వెంకన్న, మహబూబాబాద్ తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, తహసీల్దార్‌లు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న ట్రైకార్ చైర్మన్



వనదేవతల సన్నిధిలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్

మేడారం(ములుగు జిల్లా, ఆగస్టు 23 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ శుక్రవారం దర్శించుకున్నారు. ట్రైకార్ జనరల్ మేనేజర్ శంకర్‌రావుతో కలిసి మేడారాన్ని సందర్శించారు. వారిని దేవాదాయ శాఖ అధికారులు, పూజారుల ఘనస్వాగతం పలికారు. తల్లుల గద్దెలకు చేరుకున్న బెల్లయ్యనాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గద్దెల ప్రాంగణంలో ట్రైకార్ చైర్మన్, జనరల్ మేనేజర్‌కు పూజారులు తల్లుల కండువాతో సన్మానించి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమం డీడీ పోచం, జీసీ సీడీఎం ప్రతాప్‌రెడ్డి, ఏటీడీవో దేశీరాం పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

- వారం రోజుల్లో 10 మందికిపైగా గాయాలు



మూలస్తంభం వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత



ఈనెల 19న గుంతలో పడడంతో తలకు గాయమైన వాహనదారుడు

కేసముద్రం, ఆగస్టు 23 : మండలంలోని మహమూద్‌పట్నం మూలస్తంభం వద్ద రోడ్డుపై ప్రమాదభరితంగా గుంత ఏర్పడింది. ఈ గుంత అడుగు లోతులో నీళ్ల నిండి ఉండడంతో ద్విచక్ర వాహనదారులు గుర్తించలేకపోతున్నారు. సాధారణ గుంత అనుకొని అందులోంచి ద్విచక్ర వాహనాన్ని నడిపిన ప్రతీ ఒక్కరు కిందపడి గాయాలపాలవుతున్నారు. కేసముద్రం నుంచి ఇనుగుర్తికి వెళ్లే మార్గంలో ఈ గుంత ఉండడంతో వారం రోజులుగా పది మంది వరకు గాయపడ్డారు. తాజాగా ఈనెల 19న రాత్రి రెండు బైక్‌లు పది నిమిషాల వ్యవధితో ఇదే గుంతలో పడడంతో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో మహిళలు, పిల్లలు ఉండడం గమనార్హం. ఇప్పటికైనా రోడ్డుపై గుంతను వెంటనే పూడ్చాలని ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 23 : మానుకోట మునిసిపల్ పరిధిలోని 4వ వార్డు గాంధీపురంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సీడీఎఫ్ నిధుల నుంచి మంజూరైన సీసీ రోడ్డు పనులకు మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ రవీందర్‌రావు సీడీఎఫ్ నిధుల నుంచి రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, యాళ్ల మురళీధర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ చల్లాల ఉమాయాకయ్య, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, రామసహాయం వెంకట్‌రెడ్డి, మంగళంపల్లి కన్నా, జెర్రిపోతుల వెంకన్న, బానోత్ హుస్సేన్, ధరంసోత్ ప్రసాద్ పాల్గొన్నారు.

బయ్యారం అభివృద్ధికి సహకరిస్తాం

- మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ బలరాంనాయక్ వెల్లడి
- గ్రామ స్థల వివాదంపై అఖిలపక్ష నేతల వినతి



హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బయ్యారం మండల అఖిలపక్ష నేతలు

బయ్యారం, ఆగస్టు 23 : బయ్యారం గ్రామాభివృద్ధికి ఎల్లవేళలా తమవంతు సహకారం ఉంటుందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ వెల్లడించినట్లు మండల అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. గ్రామ స్థలవివాద పరిష్కారం కోసం కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీలకు చెందిన మండల అఖిలపక్ష నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నేతృత్వంలో మంత్రులతో పాటు ఎంపీని కలిసి వినతిపత్రాలను సమర్పించారు. అనంతరం అఖిలపక్ష నాయకులు ఫోన్‌లో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కొంత కాలంగా బయ్యారంలో వివాదాస్పదంగా మారిన గ్రామ స్థలాన్ని రక్షించే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రులు, ఎంపీకి విన్నవించగా.. సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. గతంలో బయ్యారం గుట్టపై మైనింగ్ నిర్వహించిన సమయంలో గోగినేని శేషగిరిరావు ద్వారా గ్రామానికి లభించిన సుమారు 1800 గజాల స్థలాన్ని కబ్జా చేయటానికి పలువురు గిరిజనులు పూనుకున్న విషయాన్ని మంత్రులు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గల స్థలానికి విలువ పెరగడంతో ఏజన్సీ ప్రాంత చట్టాలను అనువుగా మలుచుకొని పలువురు గిరిజనులు ఆక్రమించుకునేందుకు కుట్రలకు పాల్పడుతున్న విషయాన్ని వివరించినట్లు తెలిపారు. బస్టాండ్ సెంటర్ సమీపంలో ఉన్న ఈ స్థలానికి ఏళ్ల తరబడి పెన్సింగ్ వేసి, రక్షణ ఏర్పాటు చేయగా, స్థలదాత కుమారుడిని అడ్డం పెట్టుకొని ఆ భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్న తీరును వివరించామన్నారు.

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనులకు వర్తించే పలు సాంకేతిక కారణాలను సాకుగా చూపి, ఆ స్థలంపై గ్రామానికి అధికారం లేదని, అందుకే తాము కొనుగోలు చేశామని చేస్తున్న ప్రచారాలను క్షుణ్ణంగా వివరించినట్లు అఖిలపక్ష నేతలు పేర్కొన్నారు. దీంతో స్పందించిన మంత్రులు, ఎంపీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గ్రామ స్థలాన్ని రక్షించేలా చర్యలు చేపడుతూ తద్వారా గ్రామాభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లుపేర్కొన్నారు. మంత్రులు, ఎంపీని కలిసిన వారిలో మండల అఖిలపక్ష నాయకులు కాంగ్రెస్ నుంచి కంబాల ముసలయ్య, మూల మధుకర్‌రెడ్డి, ముల్కూరి వీరారెడ్డి, నాయిని శ్రీనివాస్‌రెడ్డి, సీపీఎం నుంచి మండా రాజన్న, సీపీఐ నుంచి సారిక శ్రీనివాస్, టీడీపీ నుంచి నామ బాబురావు, బీఆర్ఎస్ నుంచి గంగుల సత్యనారాయణ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ వర్గీయులు గౌని ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నుంచి ముల్కూరి సత్తిరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో మురళీధర్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 23 : వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో మురళీధర్ అన్నారు. వీఎస్.లక్ష్మీపురంలో రోడ్డుపై ఉన్న మురికినీటిని పరిశీలించి అందులో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో పాల్గొని మాట్లాడుతూ వర్షకాలంలో ప్రజలు తమతమ ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా నీరునిల్వ ఉంటే వెంటనే బ్లీచింగ్ పౌడర్ కానీ, ఆయిల్‌బాల్స్ వేసుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణలో చెత్తాచెదారం ఉండడంతో దోమలు వ్యాప్తి చెందుతాయని, దీంతో విషజ్వరాలు, డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడే ప్రమాదముందన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్‌క్యాంపులో మొత్తం 168 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 31 మంది జ్వరం ఉన్నట్లు గుర్తించి, మందులను అందజేశారు. అనంతరం జంగిలిగొండ, మల్యాల సబ్‌సెంటర్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, వరుణ్, శ్రీనివాస్, కిశోర్, గోవర్ధన్, పద్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వీఎస్ లక్ష్మీపురంలో రోడ్డుపై నిలిచిన మురికినీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

పీహెచ్‌సీని తనిఖీ..

చిన్నగూడూరు : మండలంలోని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మురళీధర్ తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి, డెంగీ రాపిడ్ కిట్స్ గురించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వే చేయాలన్నారు. ఫీవర్ కేసుల రిపోర్టు జిల్లా డేటాకు పంపించాలని సూచించారు. సీహెచ్‌వో సుదర్శన్, వనాకర్‌రెడ్డి, రాధాకుమారి, మాదవి, బాబురావు, బిచ్చా పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల తనిఖీ

మరిపెడ : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. వంటశాల, స్టోర్‌రూంలోని సరుకులు, డైనింగ్ హాల్, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. ఆరోగ్య సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. వంటలను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్ సుధీర్, పీహెచ్‌సీ డాక్టర్ రవి, ఎంపీడీవో విజయ, డీపీఏవో వనాకర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణ, ఏఎన్ఎం సరళ, సాయికృష్ణ, గురుకుల ప్రిన్సిపాల్, స్టాఫ్, సిబ్బంది ఉన్నారు.

రాఖీ పండుగకు ఆర్టీసీకి అధిక ఆదాయం

- రీజియన్‌లోనే తొర్రూరుకు ప్రథమ స్థానం
- డిపో మేనేజర్ పద్మావతి

తొర్రూరు, ఆగస్టు 23 : రాఖీ పండుగ సందర్భంగా ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తొర్రూరు డిపో పరిధిలో బస్సులను తిప్పడం ద్వారా అత్యధిక లాభాలు సమకూరినట్లు డిపో మేనేజర్ పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజువారి ఆదాయం రూ.12 లక్షలతో పాటు అదనంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఆదాయం కాకుండా రూ.40 లక్షల అదనపు ఆదాయం సమకూరిందన్నారు. 142 ఆక్యుపెన్సీ రేషియోతో బస్సులను నడిపామన్నారు. వరంగల్ రీజియన్‌లో తొర్రూరు డిపో ప్రథమ స్థానంలో నిలిచిందని, రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్‌లో 7వ స్థానంలో తొర్రూరు డిపో నిలవడం జరిగిందన్నారు. అత్యధిక ఆదాయానికి కష్టపడి పనిచేసిన డ్రైవర్, కండక్టర్లకు, అధికారులు, కార్మికులకు డిపో మేనేజర్ అభినందనలు తెలిపారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి

జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాద్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 23 : జిల్లాలో యువత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, రక్తం సేకరించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. గత కొంతకాలంగా జిల్లా వ్యాప్తంగా జ్వరాలు, డెంగీ వంటి వ్యాధులు విస్తరించటంతో రక్తకణాలు పడిపోయి, ఇబ్బందులు పడుతున్నారని, వారికి రక్తం అవసరముంటుందని వివరించారు. అలాంటి వారు బ్లడ్ బ్యాంకులను సంప్రదిస్తున్నారని, ఐనప్పటికీ రక్తనిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలనుకునే యువత ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు ప్రసాద్ : 9440102677, ఎం.వెంకట్‌రెడ్డి : 94405 82664, డాక్టర్ నెహ్రూరాథోడ్ : 95023 61832, ఆర్.రవిచందర్ రెడ్డి : 94406 91942, డాక్టర్ హిస్నేష్‌కుమార్ : 91774 55655 సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

రేపు జిల్లాస్థాయి యోగా పోటీలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 23 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఈనెల 25న జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తునం పుష్పలీల, గుజ్జునూరు నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 14 సంవత్సరాలలోపు సబ్ జూనియర్, 14 నుంచి 18 జూనియర్స్, 18 ఏళ్ల పైబడిన సీనియర్స్, 35-45సంవత్సరాల మాస్టర్స్ బాల, బాలికలు, పురుషులు, మహిళలు పాల్గొనవచ్చున్నారు. ఈ పోటీలో పాల్గొనాలనుకునే వారు పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకుని ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. జిల్లాలోని అన్ని గురుకుల, ప్రభుత్వ, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 89197 03008ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

జడ్పీ సీఈవో విద్యాలత

హసన్‌పర్తి, ఆగస్టు 23: మహాత్మా జ్యోతిబా పూలే బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను అందించాలని జెడ్పీ సీఈవో విద్యాలత అన్నారు. మండలంలోని ఎల్లాపూర్‌లో గల తిమ్మాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల విద్యాలయాన్ని శుక్రవారం విద్యాలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిస్థితిని, ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టాక్ రూం, రన్నింగ్, ఆర్‌వో వాటర్, టాయిలెట్స్‌తో పాటు ఇతర వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యలు వచ్చినప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులను సమన్వయం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు మెరుగైన వసతులను సమకూర్చేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులున్నారు.



డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యాలత



ప్రేమపెళ్లి చేసుకుని ముఖం చాటేశాడు

భర్త, ఆరుగురిపై కేసు నమోదు

భీమదేవరపల్లి, ఆగస్టు 23: మండలంలోని ముల్కనూర్‌లో ప్రేమ వివాహం చేసుకొని ముఖం చాటేసిన భర్తతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ముల్కనూర్ ఎస్‌ఐ సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రికి చెందిన ఉడిపి చంద్రకళను మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన బొల్లంపల్లి రంజిత్ 2018లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. చంద్రకళతో రంజిత్ సుమారు ఏడేళ్లు సహజీవనం చేశాడు. గత నెల జూలై 29న తన ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన రంజిత్.. భార్య చంద్రకళ వద్దకు రావడం లేదు. దీంతో అనుమానం వచ్చిన చంద్రకళ ముల్కనూర్‌లోని అత్తాగారి ఇంటికి వచ్చి తన భర్త రంజిత్ కోసం వాకప్ చేసింది. రూ. 50 లక్షల కట్నం ఇవ్వాలని చంద్రకళను భర్త రంజిత్, అత్తామామలు రామచంద్రం- కనకలక్ష్మి, ఆడబిడ్డలు రమాదేవి, ధనలక్ష్మిలు బెదిరిస్తున్నారు. దీంతో చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేయగా, భర్త రంజిత్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు రామచంద్రం, కనకలక్ష్మి, బొల్లంపలి రాజు, రమాదేవి, ధనలక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు ముల్కనూర్ పోలీసులు తెలిపారు. రంజిత్ పరారీలో ఉన్నాడు.

రికార్డుల్లో ఎక్కువ..

హాస్టల్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్య తక్కువ

అధికారుల తనిఖీలో గుట్టు రట్టు

ఆత్మకూరు, ఆగస్టు 23: హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా.. రికార్డులో మాత్రం విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపిస్తున్న విషయం అధికారుల తనిఖీల్లో బయటపడింది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ఎస్సీ బీసీ రెండు హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో 43 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో పేర్లు ఉన్నాయి కానీ రెండు హాస్టల్‌లో కేవల 17 మంది విద్యార్థులు ఉన్నారని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, నాయిని జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య ఆదేశానుసారం రెండు హాస్టల్‌లను ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఆర్‌ఐ రవీందర్‌రావు ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా లేని విషయాలను గుర్తించారు. ఈ విషయాలను జిల్లా కలెక్టర్ కు నివేదికను సమర్పిస్తామన్నారు. సరైన వసతి లేకపోవడంతో విద్యార్థులు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లిపోతున్నట్లు విద్యార్థులు తెలిపారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు















'అడ్డగోలు రిజిస్ట్రేషన్ల'పై విజిలెన్స్ ఆరా

- రంగంలోకి అధికారులు.. వెలుగులోకి మరిన్ని అక్రమాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రకంపనలు



రాంనగర్, ఆగస్టు 23 : వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'నిబంధనలు మరిచి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు' చేశారన్న అంశంపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనం రిజిస్ట్రేషన్ శాఖలో తీవ్ర ప్రకంపనలు రేపింది. ఈ రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు జిల్లాలోని మిగిలిన కార్యాలయాల్లో పరిస్థితంతా గప్‌చుప్‌గా మారినట్టు తెలిసింది. ఇటీవల బదిలీపై వచ్చిన ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహించినట్టు సమాచారం. ఎవరితో మాట్లాడితే ఏమవుతుందో అనే అనుమానంతో మౌనంగానే విధులు నిర్వహించి వెళ్లినట్టు తెలిసింది. కాగా బదిలీపై వెళ్లిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు నిబంధనలు విస్మరించి నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి అందినకాడికి దండుకున్నారనే విషయమై విజిలెన్స్ అధికారులు ఆరా తీసినట్టు సమాచారం. రెండు కార్యాలయాల్లో గత ఆరు నెలల్లో జరిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలు సేకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సోమవారం రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

వెలుగులోకి మరిన్ని అక్రమాలు

కాగా వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు పరకాల, మహబూబాబాద్, ములుగు కార్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిసింది. నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లతో పాటు పహాణీలతో రిజిస్ట్రేషన్లు చేసినట్టు తెలిసింది. పూర్వీకులు అమ్ముకున్న స్థలాలను కుటుంబ సభ్యులు విక్రయించడం లాంటి రిజిస్ట్రేషన్లు చేశారని, వరంగల్ రూరల్ కార్యాలయంలో కొద్దిరోజులు ఇన్‌చార్జ్‌గా బాధ్యతల్లో ఉన్న ఒక అధికారి వరంగల్ ప్రాంతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని సమాచారం. ఈ అధికారి నిబంధనలు తుంగలో తొక్కి పహాణీలతో రిజిస్ట్రేషన్లు చేశాడనే ఆరోపణలున్నాయి. పరకాలలో కూడా నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు, పార్ట్ రిజిస్ట్రేషన్లు భారీగానే జరిగినట్లు తెలిసింది. ఈ దందాలో పెద్ద మొత్తంలో కాసులు చేతులు మారినట్టు తెలుస్తుండగా ఇటీవల ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ హయాంలో జరిగిన రిజిస్ట్రేషన్లు పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశమున్నట్టు చర్చ జరుగుతోంది. ఇక మహబూబాబాద్, ములుగు కార్యాలయాల పరిధిలో నాన్ లేఅవుట్ వెంచర్లకు సంబంధించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పెద్ద ఎత్తున జరిగినట్లు తెలుస్తుండగా గతేడాది కాలంగా ఈ దందా విచ్చలవిడిగా జరిగినట్టు సమాచారం. అధికారులు వరంగల్ రూరల్, ఖిలా వరంగల్, పరకాల, మహబూబాబాద్, ములుగు కార్యాలయాల్లోని రికార్డులు పరిశీలిస్తే మరిన్ని అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

కొలువులకు.. భద్రతేదీ?



మున్షాన్‌పల్లి పాఠశాలను శుభ్రం చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ పర్శరాములు

- ఆర్థిక ఇబ్బందులతో పార్ట్‌టైం స్వీపర్లు
- పర్మినెంట్ చేస్తారని 30ఏళ్లుగా ఎదురుచూపు
- హైపవర్ కమిటీ వేసినా ఫలితం శూన్యం
- ఏపీలో పాతికేళ్ల క్రితమే క్రమబద్ధీకరణ
- తెలంగాణలో ఇప్పటివరకు అతీగతీ లేదు

బచ్చన్నపేట, ఆగస్టు 23: మంచి రోజులు రాకపోతాయా.. దశ మారకపోతుందా.. అని పార్ట్ టైమ్ స్వీపర్లు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందుతామని, కనీస వేతనం అందుతుందని 30 ఏళ్లకు పైగా చాకిరీ చేస్తున్నారు. చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతూ బతుకుబండిని నెట్టుకొస్తున్నారు. రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో దశాబ్ధాలుగా పని చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ల దుస్థితి ఇది. వీరిలో ఇప్పటికే అనేక మంది మృతి చెందగా, కొందరు రిటైర్ అయ్యారు. 1983లో పార్ట్‌టైం స్వీపర్లుగా ఆంధ్ర, తెలంగాణాలో ఒకేసారి నియామకం అయినప్పటికీ 1994లో అక్కడి వారిని పర్మినెంట్ చేశారు. కాని తెలంగాణలో ఇప్పటి వరకు మోక్షం కలగలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని ఆశించినప్పటికీ వారికి నిరాశే ఎదురైంది. మొదట్లో వీరికి నెలకు రూ. 150 జీతం వచ్చేది. అతి తక్కువ జీతమైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో కొలువు అన్న భావనతో పని చేస్తున్నారు. పర్మినెంట్ అయితే జీతం పెరుగుతుందని ఆశతో జీవిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది ప్రస్తుతం పనిచేస్తున్నారని సంఘం నేతలు చెబుతున్నారు. వారిలో జనగామ జిల్లా నుంచి 35 మంది ఉన్నారు.

హైపవర్ కమిటీ వేసినా ఉపయోగం లేదు..

వేతనాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని పార్ట్‌టైం స్వీపర్లు చేసిన ఆందోళనలతో 1992లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వారిని పర్మినెంట్ చేసేందుకు హైపవర్ కమిటీ వేశారు. ఏవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీ స్వీపర్ల క్రమబద్ధీకరణకు అనుకూలంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. వీరి వేతనాన్ని స్థిరీకరించి టైమ్ స్కేల్ ఇవ్వాలని ఆదేశించింది. కాని, ఈ ఉత్తర్వులు అమలు కాకపోవటంతో హైకోర్టుకు వెళ్లారు. దీంతో ఈ విషయంలో ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవోఎంఎస్ నెం.212 ద్వారా 1994 ఏప్రిల్ 22న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్వీపర్లు ఇక తమ కష్టాలు గట్టెక్కినట్టేనని సంబరాలు చేసుకున్నారు. కాని ఆంధ్ర ప్రాంతంలో పని చేసిన అధికారులు అక్కడ పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లను పర్మినెంట్ చేశారు. వారు ప్రస్తుతం రూ.20 వేల జీతం పొందుతున్నారు. కానీ తెలంగాణలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. తర్వాత తమ సమస్యలు పరిష్కరించాలని 2007లో చలో సీఎం కార్యక్రమం నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. అయినా స్పందన లేకపోవడంతో మానవ హక్కుల సంఘాన్ని సైతం ఆశ్రయించారు. దీంతో వారికి అనుకూలంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, ఆర్థిక శాఖల అధికారులను సంఘం ఆదేశించింది. వీరి వివరాలు తెప్పించుకున్న అధికారులు అంతటితోనే చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం నెలకు రూ. 5200 ల వేతనంతో జీవితం గడుపుతున్నారు. పార్ట్ టైం స్వీపర్లు పనిచేస్తున్న పాఠశాలల హెచ్‌ఎంలు అటెండెన్స్ పత్రాలను ఎంపీడీవోకు ప్రతీనెల పంపిస్తే వారు బిల్లులు చేసి ఎస్‌టీవోకు పంపుతారు. మూడు మాసాలు, ఆరు మాసాలకోమారు జిల్లా పరిషత్ నుంచి వచ్చే కాంటిన్‌జెన్సీ నిధులు జమచేస్తే వీరికి జీతాలు ఖాతాల్లో పడుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకుని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని స్వీపర్లు కోరుతున్నారు.

ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలి

- గూడముల అయోధ్య, పార్ట్‌టైం స్వీపర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



తెలంగాణ రాష్ట్రం వచ్చాక మా బతుకులు మారుతాయనుకున్నాం. కాని, మమ్మల్ని పర్మినెంట్ చేయటంలో కేసీఆర్ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. 1983 నుంచి అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రస్తుతం పని చేస్తున్నావారిని పర్మినెంట్ చేయడంతో పాటు మృతి చెందిన వారి కుటుంబాలకు, రిటైర్ అయిన వారి కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలి.

కట్య్మారు బడిలో 35 ఏళ్లు పనిచేశా..

- బాలమల్లయ్య, రిటైర్డ్ పార్ట్‌టైం స్వీపర్, కట్య్మారు



కట్య్మారు ప్రైమరీ పాఠశాలలో 35 ఏళ్లు పనిచేశా. ప్రారంభంలో రూ. 150 జీతం ఇచ్చేవారు. రిటైర్‌మెంట్ సమయానికి రూ. 4 వేలు చేశారు. ఉద్యోగంలో చేరే సమయంలో కొద్ది రోజుల్లోనే పర్మినెంట్ చేస్తామన్నారు. ఇప్పటి వరకు అమలు చేయలేదు. అనేక సార్లు ఆందోళనలు చేశాం. కోర్టుకు వెళ్లాం. అయినా మా బతుకులు మారలేదు. మంచి రోజులు రాకపోతాయా అని ఎదురు చూస్తూ మా జీవితాలను బజారున పడేసుకున్నాం. ప్రస్తుతం పనిచేస్తున్న వారికైనా ప్రభుత్వం న్యాయం చేయాలి.

సీఆర్‌పీఎఫ్ వాహనం నుంచి కిందపడ్డ కార్బన్ వెపన్

- ఆయుధాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేసిన ఆటోడ్రైవర్
- సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి గన్‌ను అప్పగించిన పోలీసులు

మట్టెవాడ, ఆగస్టు 23: వరంగల్ ఎంజీఎం జంక్షన్ సమీపంలో సీఆర్‌పీఎఫ్ ట్రక్ వాహనం నుంచి కార్బన్ వెపన్ ఎంజీఎం జంక్షన్ సమీపంలో కిందపడిపోయింది. అదే సమయంలో అటు వైపు నుంచి వస్తున్న ఆటో డ్రైవర్ గమనించి ఆ ఆయుధాన్ని మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో అప్పగించిన ఘటన వరంగల్‌లో చోటు చేసుకుంది. వరంగల్ మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో భీమారంలోని సీఆర్‌పీఎఫ్ బెటాయిన్ మణిపూర్‌కు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాల్లో సిబ్బందితోపాటు ఆయుధాలను వరంగల్ రైల్వేస్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వాహనం నుంచి సీలింగ్ ఊడిపోయి కార్బన్ వెపన్ కింద పడిపోయింది. అదే సమయంలో పైడిపల్లికి చెందిన ధరావత్ శ్రీను ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా, ఓ షోరూం ఎదురుగా ఉన్న రోడ్డుపై ఆయుధం ఉండడానిన గుర్తించాడు. వెంటనే అతడు మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ ధర్మనాయక్‌కు అప్పగించారు.

కొంత సమయం తర్వాత సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వెపన్ వెతుకుతున్న క్రమంలో స్టేషన్‌లో అప్పగించినట్లు తెలుసుకున్నారు. దీంతో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ రాజేష్‌కుమార్ పోలీసు స్టేషన్‌కు చేరుకొని విషయం వెల్లడించగా వారు ఆయుధాన్ని అప్పగించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీరకం)	2711	2572
పల్లికాయ(పచ్చిది)	3900	3200
పల్లికాయ(సూక)	5900	5000
పెసర	5855	5155
పత్తి	7410	5000
పసుపు(కాడి)	12223	12223
పసుపు(గోల)	12226	12226
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	18000	15000
వండర్‌హాట్ ఏసీ	14800	11000
యూఎస్341 ఏసీ	14500	11000
తాలు మిర్చి	6000	3000

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 23: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి ఆ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మార్కెట్లో క్రయవిక్రయాలు యథావిధిగా నిర్వహించబడుతాయని, రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

మెట్టుగుట్ట ఆలయ అర్చకుడిపై ఫిర్యాదులు

విచారణ చేపట్టిన డిప్యూటీ కమిషనర్?

వరంగల్ కల్చరల్, ఆగస్టు 23 : మడికొండ మెట్టుగుట్టలోని మెట్టు రామలింగేశ్వర దేవాలయం ఆలయ అర్చకుడిని శుక్రవారం జిల్లా సహాయ కమిషనర్ రాయల సునీతతో కలిసి ఆలయానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు సమాచారం. డబ్బులు వసూలు చేయడమేకాక, డబ్బున్న వారికే ప్రాధాన్యమిస్తున్నారంటూ భక్తులు దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావుకు అర్చకుడు అభిలాష్‌శర్మపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఆలయానికి చేరుకొని దేవాదాయ శాఖ ఆలయ క్లర్క్ భాస్కర్‌పై కూడా ఆరోపణలు ఉన్న నేపథ్యంలో డీసీ భక్తులను అర్చకుడిని, క్లర్క్‌ను విచారించినట్లు తెలిసింది.

రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన

- బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు నారాయణ
- హనుమకొండలో రెండో రోజూ సాగిన కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు



వయనాడ్ బాధితుల కోసం డి.రాజాకు చెక్కు అందిస్తున్న నాయకులు

బాలసముద్రం, ఆగస్టు 23 : నరేంద్రమోదీ ఎన్నికల్లో గెలిచినా నైతికంగా ఓడిపోయారని, ఆయన పాలన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సాగుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. 'దేశంలోని మహిళలకు న్యాయం చేస్తాం.. సబ్ కే సాత్.. సబ్ వికాస్' అని ప్రకటించిన మోదీ ప్రభుత్వం తమ నినాదాన్ని మార్చుకుని తమతో ఎవరుంటే.. వారితో తాముంటాం అనే కొత్త నినాదాన్ని అమలు చేస్తోందని ఆరోపించారు. దేశంలో మహిళలకు రక్షణ లేదని, వివిధ రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో కేంద్రం ద్వారా నామినేట్ చేయబడిన గవర్నర్లతో రాజ్యాంగ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగుతోందని, ఏపీ సీఎం చంద్రబాబు, నితీష్‌కుమార్ మద్దతు ఇవ్వకుంటే కేంద్ర ప్రభుత్వం పడిపోతుందన్నారు. దేశంలో సీబీఐ సంస్థ అత్యంత పవర్‌ఫుల్ సంస్థ అని ఆ సంస్థ అదానీ చేతిలోకి వెళ్లిందని విమర్శించారు. దేశంలోని బీజేపీ వ్యతిరేక పార్టీలు అధికారంలో ఉన్న తమిళనాడు, కేరళ, ఢిల్లీ, కర్నాటక సీఎంలను సీబీఐ సంస్థలతో ఇబ్బందులకు గురి చేసిందన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మధ్య దూరం పెరిగిందని, ప్రధాని మోదీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు జాతీయ స్థాయిలో ఉన్న ఇమేజ్‌ను వాడుకుని దేశంలో రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన చేస్తున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, అమరావతికి రూ.వేల కోట్ల నిధులు ప్రపంచ బ్యాంకుల నుంచి అప్పులు ఇప్పించి మోదీ చంద్రబాబును పావుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పును సీపీఐ స్వాగతిస్తున్నట్లు నారాయణ తెలిపారు. వర్గీకరణకు క్రీమీలేయర్‌కు సంబంధంలేదని, రాష్ట్రంలో ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీలో బీఆర్‌ఎస్ విలీన మవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతుండగా, రేవంత్ బీజేపీలో చేరుతారని బీఆర్‌ఎస్ నాయకులు అంటున్నారన్నారు. రెండు పార్టీ లు రాజకీయ క్రీడ ఆడుతున్నారని, ప్రజలకు కావాల్సింది, అభివృద్ధి, సంక్షేమం అని నారాయణ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన సరిగ్గా చేసుకోవాలని హితవు పలికారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపో యాయని ధరల నియంత్రణ డిమాం డ్ చేస్తూ సెప్టెంబరు 1 నుంచి 7వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నామని, ఈ ప్రజా పోరాటాలలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా మాట్లాడుతూ ప్రజలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువచ్చిందని, ప్రజలకు, ప్రజాస్వామిక వాదులతో చర్చించకుండా ఇటీవల న్యాయ చట్టాలు రూపొందిం చిందన్నారు. దేశంలో విద్యా, వైద్యం పేద ప్రజలకు అందడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మా, కలవేణ శంకర్, ఎం. బాలనరసింహ, బి. విజయసారథి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వయనాడు బాధితులకు సీపీఐ తెలం గాణ సమితి నుంచి రూ.5.41లక్షల ఆర్థిక సహాయాన్ని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అందించారు.



మాట్లాడుతున్న ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్, చైర్మన్ కరుణాకర్‌రెడ్డి

ఏకశిల ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం

వరంగల్ మెడికల్, ఆగస్టు 23 : తెలంగాణలో (హైదరాబాద్ మినహా) తొలి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను హనుమకొండలోని ఏకశిల ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్, చైర్మన్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏకశిల హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాయపర్తి గ్రామానికి చెందిన గాదె విజయ్ కుమార్ గత ఏడు సంవత్సరాలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా డయాలసిస్‌పై ఉండగా హాస్పిటల్‌లోని నెప్రాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్ కుమార్‌ల సూచన మేరకు డయాలసిస్ టెక్నికల్ మేనేజర్ రమేశ్ ప్రోద్బలంతో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పేషంట్ భార్య ఉమాదేవి కిడ్నీని దానం చేసింది. ఈ క్రమంలో భార్యాభర్తలిద్దరిని వైద్య బృందం సునిశితంగా పరీక్షించి శస్త్ర చికిత్సకు వెళ్లవచ్చని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ శస్త్ర చికిత్సలో ట్రాన్స్‌ప్లాంట్ యూరాలజిస్టు డాక్టర్ ఎస్.జయరాంరెడ్డి, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్, నెప్రాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్‌కుమార్, అనస్థీషియా డాక్టర్ వి.రమేశ్‌ల ఆధ్వ ర్యంలో ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం పేషంట్‌తోపాటు కిడ్నీ దాత ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నట్లు వివరిం చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, డాక్టర్లు, వైద్య బృందం, హాస్పిటల్ ఆర్‌ఎంవో డాక్టర్ వెంకట్‌రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కొడుకు మృతి..

- తట్టుకోలేక ఆగిన సవతితల్లి గుండె
- మహబూబాబాద్‌లో విషాద ఘటన

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 23 : తన కడుపున పుట్టకపోయినా.. కన్నవారితో సమానంగా ఆ కుమారుడిని సాకింది ఆ తల్లి. సవతితల్లి అనే మాటే కానీ పిల్లలను పెంచే విషయంలో ఎక్కడా సొంత తల్లి లేని లోటును కనిపించకుండా పెంచి పోషించింది. అలాంటి ఆ తల్లి అనారోగ్యంతో మృతి చెందిన కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తూ ప్రాణాలొదిలిన విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు శనిగపురంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.

శనిగపురం గ్రామానికి చెందిన మంద వెంకన్న రైల్వే ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వెంకన్న భార్య స్వరూప 30 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటికే వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. భార్య చనిపోవడంతో వెంకన్న పిల్లల ఆలనాపాలన కోసం చిన్న గూడూరు మండలం జయ్యారానికి చెందిన జ్యోతి (50)ని రెండో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత జ్యోతి ఆ ముగ్గురు పిల్లల బాగోగులు చూసుకునేది. ఈ క్రమంలోనే వెంకన్న, జ్యోతికి ఓ కుమారుడు, కుమార్తెకు జన్మించారు. అయినప్పటికి జ్యోతి ఐదుగురు పిల్లలను తారతమ్యం లేకుండా పెంచి పెద్ద చేసింది. మొత్తం ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులకు వివాహాలు చేసింది. ఏడాది క్రితం వెంకన్న కూడా చనిపోవడంతో జ్యోతి ఖమ్మంలోని తన కూతురు వద్ద ఉంటోంది. ఈ క్రమంలో వెంకన్న మొదటి భార్య కుమారుడు రవి (32) శనిగపురంలో ఆటో నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కానీ, ఇటీవల కాలంలో మద్యానికి బానిసైన రవి తరచూ గొడవపడటంతో అతడి భార్య స్వప్న నాలుగు నెలల క్రితం నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలోని తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయిన రవి అనారోగ్యం పాలై గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు ఖమ్మంలో ఉన్న సవతితల్లి జ్యోతికి సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం శనిగపురం చేరుకున్న జ్యోతి రవి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించింది. ఈ క్రమంలోనే గుండెపోటుకు గురై కొడుకు మృతదేహంపైనే అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబసభ్యులు స్థానిక వైద్యుడికి చూపించారు. అయితే అప్పటికే జ్యోతి మృతి చెందినట్టు నిర్ధారించారు. అనంతరం కుటుంబసభ్యులు రవి అంత్యక్రియలను నిర్వహించి.. జ్యోతి మృతదేహాన్ని ఆమె పుట్టినిల్లయిన చిన్న గూడూరు మండలం జయ్యారానికి తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు రవికి భార్య స్వప్న, నాలుగేళ్ల కుమారుడు నవనీత్‌కుమార్ ఉండగా.. నాలుగేళ్ల నవనీత్ కుమార్ తండ్రికి తలకొరివి పెట్టడం చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇక తనకు పుట్టక పోయినా చిన్నప్పటి నుంచి ప్రేమగా పెంచి పోసించిన కుమారుడు ఇలా చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన జ్యోతి అతడి మృతదేహంపై పడి మృతి చెందడం తమను కలిచివేసిందని కుటుంబసభ్యులు, గ్రామస్థులు చెబుతున్నారు.



మంద రవి (ఫైల్)



జ్యోతి (ఫైల్)



రమేష్ అంతిమసంస్కారాలు నిర్వహిస్తున్న చిన్నారి నవనీత్

భూసేకరణే అడ్డు!

5వ పేజీ తరువాయి

కోరింది. అయితే గత ప్రభుత్వం రూ.520కోట్ల నిధులతో పాటు 253 ఎకరాల భూమిని కేటాయించేందుకు ముందుకు వచ్చింది. దీనికి సంబంధించి 2023 ఆగస్టు నెలలో జీవో ఎంఎస్ నెం.36ని జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను ఏఏఐ పరిగణనలోకి తీసుకోకపోవటం, భూసేకరణ, నిధులు విడుదల చేయటంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విమానాశ్రయం పనులు 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అనే చందంగా మారింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మామునూరు ఎయిర్‌పోర్టుపై దృష్టి పెట్టింది. దీంతో రంగంలోకి దిగిన ఏఏఐ అధికారులు మామునూరులో ఉన్న పాత 1.8కి.మీ రన్‌వేను పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో విమనాలు నడిపించేందుకు అనుకూలంగా ఉండేలా ప్రస్తుతం ఉన్న 1.8కి.మీల రన్‌వేను 3.9కి.మీలకు పెంచాలని ఏఏఐ అధికారులు సూచించారు. ఇప్పటికే పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 694ఎకరాల వరకు భూమి ఉంది. కనీసం మరో 306 ఎకరాల భూమిని కేటాయిస్తే పెద్ద విమానాలు నడిపించేలా రన్‌వేను నిర్మించవచ్చునని ఏఏఐ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ స్థాయిలో విమానాలను నడిపించేందుకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నట్లుగా అధికారులు నిర్ధారించినట్లుగా సమాచారం.

భూసేకరణే ప్రధాన అడ్డంకి..

వరంగల్ ఎయిర్‌పోర్టుకు ప్రధానంగా భూసేకరణే అడ్డంకిగా మారుతోంది. నిజాం కాలంలో 1,875ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు కోసం కేటాయించారు. అయితే ప్రస్తుతం ఇందులో నుంచి జవహర్ నవోదయ విద్యాలయానికి 23.20ఎకరాలు, పోలీస్ శిక్షణ కళాశాలకు 59ఎకరాలు, ఏసీపీ కార్యాలయానికి 10ఎకరాలు, వరంగల్ సెంట్రల్ జైలుకు 101ఎకరాలు, ఫోర్త్ బెటాలియన్‌కు 241.24ఎకరాలు, మరో 675 ఎకరాల భూమిని వెటర్నరీ యూనివర్సిటీకి కేటాయించారు. రోడ్డు, ఇతర వాటికి పోగా ప్రస్తుతం 696ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. అయితే ఎయిర్‌పోర్టుకు 1,200ఎకరాల భూమి అవసరం కాగా, కనీసం వెయ్యి ఎకరాల భూమి అయినా ఇవ్వాలని కేంద్ర విమానాయశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇంకా 304ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. జూన్ 29న వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఏఏఐ అధికారులతో ప్రభుత్వం జరిపిన చర్చల మేరకు త్వరగా ఎయిర్‌పోర్టుకు భూమి కేటాయించాలని రెవెన్యూ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో వరంగల్ జిల్లా కలెక్టర్‌తో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగెం మండలంలోని గుంటూరుపల్లి, నక్కలపల్లి, గడపల్లి, మామునూరు గ్రామాల్లో భూసేకరణ కోసం గ్రామసభలు నిర్వహించారు. ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని రైతుల నుంచి 259ఎకరాల వరకు సేకరించాలని నిర్ణయించారు. అయితే ఎయిర్‌పోర్టుకు భూములు ఇచ్చేందుకు రైతులు సానుకూలంగానే ఉన్నారు. కానీ, తమకు భూమికి బదులుగా మరో చోట భూమి కావాలని పట్టుబడుతున్నారు. వెటర్నరీ కాలేజీలో అదనంగా ఉన్న సుమారు 60ఎకరాల భూమిని రైతులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్చలు జరిపింది. అయితే ఆ భూమి సాగుకు అనుకూలంగా లేని చౌడు నేల కావటంతో రైతులు విముఖత చూపుతున్నట్లుగా సమాచారం. ప్రత్యామ్నాయంగా భూమి లేకపోవటంతో నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎకరానికి రూ.80లక్షలు చెల్లించేందుకు రైతులతో అనధికారికంగా చర్చలు జరిపారు. తమ భూములకు ప్రభుత్వం ధర కాకుండా బహిరంగ మార్కెట్‌లో ధరను చెల్లించాలని రైతులు పట్టుబడుతున్నారు. ఎయిర్‌పోర్టు వస్తుండటంతో ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.1.50కోట్ల నుంచి రూ.2కోట్లకు పైగా ధర పలుకుతోందని, ఆ ధరనే తమకు చెల్లించాలని రైతులు పట్టుబడుతున్నారు. దీంతో 259ఎకరాలకు రూ.388.5కోట్ల నుంచి రూ.518కోట్లు నష్టపరిహారం కిందనే చెల్లించాల్సి వస్తుంది. ఇంత పెద్దమొత్తంలో రైతులకు నష్టపరిహారం ఇవ్వడం కుదరదని అధికారులు పేర్కొంటున్నారు. నష్టపరిహారంపై రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం నుంచి రైతులకు చెల్లించే నష్టపరిహారంపై ఎలాంటి స్పష్టత రాకపోవటంతో ఎయిర్‌పోర్టు పనులకు ఆటకం ఎదురవుతోంది. రైతుల నుంచి 259 ఎకరాలతో పాటు వెటర్నరీ కాలేజీకి చెందిన 40 ఎకరాల భూమి కూడా కలుపుకుని సుమారు 299 ఎకరాల భూమిని ఏఏఐకి కేటాయించాలని అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో ఏఏఐ కావాల్సిన సుమారు వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు పూర్తి అవుతుందని భావిస్తున్నారు.

ఎకరాకు రూ.2కోట్ల పరిహారం ఇవ్వాలి

- దండ నరేష్, గుంటూరుపల్లి, సంగెం మండలం, వరంగల్ జిల్లా



ఎయిర్‌పోర్టు కోసం భూములు ఇచ్చేందుకు అభ్యంతరం లేదు. కానీ, ఎయిర్‌పోర్టు కోసం భూములను త్యాగం చేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. బహిరంగ మార్కెట్‌లో ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.2కోట్ల వరకు ధరలు ఉన్నాయి. అవే ధరలను భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించాలి. అలాగే రైతు కుటుంబంలోని అర్హతలను బట్టి ఎయిర్‌పోర్టు ఉద్యోగావకాశాలు కల్పించాలి.

'సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 23 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెనుశాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో సీపీఎస్ విధానంలో కొనసాగుతామని 2014 ఆగస్టు 23న ఇచ్చిన జీవో నెంబర్ 28 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రెండు లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయులను సీపీఎస్ విధానంలోకి బలవంతంగా లాగడం జరిగిందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగమణి, లక్ష్మీకాంత్, భాస్కర్, రఫిక్, సారంగం, రవీందర్‌నాయక్,



మానుకోటలో జీవో నెంబర్ 28 ప్రతులను దహనం చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

మోబిన్ అహ్మద్, కుమార్, వీరన్న, అశోక్, శివప్రసాద్, మమత, శ్రీను, రవి, మధు, రాజేందర్, సరోజ, ప్రగతి, రమేష్, బాలరాజు, రంజిత్, నరేష్, చంద్రమౌళి, బాలు, రామకృష్ణ, దేవేందర్ పాల్గొన్నారు.

● డోర్నకల్ : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నిపునరుద్ధరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకుడు వివేక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగాకన్నెగుండ్ల జడ్పీ హైస్కూల్లో ఆయన మాట్లాడారు. నాయకులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్, రామకృష్ణ, శ్రీనివాస్, సాహెబ్‌అలీ, శంకర్, రాములు, అమీన్, రేణుక, సీతారాములు పాల్గొన్నారు.

● మరిపెడ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లింగాల మహేశ్‌గౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.సీతారాంపురం పీఎస్ స్కూల్‌లో జరిగిన ఆ సంఘం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అర్జున్, మంగీలాల్, కవిత, వెంకటేశ్వర్‌రావు, ఆదిలక్ష్మి, సందీప్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 23 : ముదిరాజ్‌లను బీసీ డి నుంచి ఏ లోకి మార్చేందుకు కృషి చేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రతినిధులు ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని వేం నరేందర్‌రెడ్డి నివాసంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు కలిసి రాష్ట్రంలో ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న 14 అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వారు 14 సమస్యలతో నిత్యం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సంస్థగత కమిటీలలో స్థాయిలను బట్టి ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం ఇవ్వాలని, అలాగే కార్పోరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లుగా అవకాశం కల్పించాలని కోరారు. ఈసమస్యను పరిష్కరిస్తామని వేం నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

ఈకార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శేఖర్‌ముదిరాజ్, అండె బాబన్న, గొడుగు శ్రీనివాస్, మద్దెర్ల సంతోష్, శివయ్య, బోళ్ల కరుణాకర్, రమేష్, కృష్ణస్వామి, తిట్ల నగేష్, కనకయ్య, రిషికుమార్, అనిల్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సైబర్‌క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇనుగుర్తి, ఆగస్టు 23 : సైబర్‌క్రైమ్ పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. ఇనుగుర్తి మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం సైబర్‌క్రైమ్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించాలని అప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసి షీటీమ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలు డయల్ 100 కాల్ చేస్తే వెంటనే పోలీసులు వచ్చి సమస్యను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజ్ పాల్గొన్నారు.

మహిళలు షీటీమ్‌ను సంప్రదించండి..

●కురవి : మహిళల భద్రత కోసమే ప్రభుత్వం, పోలీస్ డిపార్ట్‌మెంట్ షీటీమ్స్‌ను ఏర్పాటు చేశాయని, ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు షీటీమ్స్‌ను సంప్రదించాలని ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. బలపాల



ఇనుగుర్తిలో సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య

జడ్పీహెచ్ఎస్‌లో మహిళల భద్రత, సైబర్‌క్రైమ్, ట్రాఫికింగ్, మత్తుపదార్థాల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్ కానీ, వాట్సాప్ కాల్ కానీ మాట్లాడవద్దని సూచించారు. విద్యార్థులు, మహిళలు ఆపదలో ఉంటే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. షీటీమ్‌ను సెల్ : 87126 56935, 79011 42009 నెంబర్లను సంప్రదించాలన్నారు. సైబర్ క్రైమ్ సీఐ వెంకటేశ్వర్లు, కురవి ఎస్సై సతీష్, షీటీమ్ ఎస్సై సునంద, హెచ్ఎంలు నర్సింహారెడ్డి, హెచ్ఎం సునీత పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు తెమడ పరీక్షలు

నెహ్రూసెంటర్, ఆగస్టు 23 : క్షయ వ్యాధి నిర్మూలన కోసం తెమడ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మహబూబాబాద్ సబ్‌యూనిట్ అధికారి వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బెస్తబజార్, గుమ్ముడూరు, అంబేద్కర్‌నగర్ సబ్‌సెంటర్‌ల పరిధిలోని క్షయవ్యాధిగ్రస్తుల వివరాలను సేకరించారు. అనంతరం వారికి తెమడ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 51 మందికి క్షయవ్యాధి నివారణ కోసం తెమడ నమూనాలు సేకరించి, పరీక్షల నిర్ధారణ కోసం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని టీహబ్‌కు తరలించినట్లు చెప్పారు. రిపోర్టుల ఆధారంగా రోగులకు ఉచితంగా మందులు అందించనున్నట్లు చెప్పారు. కిరణ్మయి, విజయకుమారి, సుమలత, శ్రీహరి, ఆశాకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొత్తగూడ, ఆగస్టు 23 : కుక్కను తప్పించే క్రమంలో ద్విచక్రవాహనం అదుపుతప్పటంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం ముస్మి గ్రామానికి చెందిన రాంసింగ్, మోహన్ నర్సంపేటకు వెళుతుండగా కొత్తగూడలో అకస్మాత్తుగా కుక్క అడ్డుగారావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయింది. దీంతో రాంసింగ్, మోహన్‌లకు తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు.

రైతుల పట్ల బీఆర్ఎస్‌ది కపట ప్రేమ : కాంగ్రెస్

డోర్నకల్, ఆగస్టు 23 : రైతుల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కపట ప్రేమ చూపుతుందని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. హైదరాబాద్ నుంచి ఫోన్ ద్వారా శుక్రవారం డోర్నకల్ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో గతంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలు, టార్పాలిన్‌లు, ట్రాక్టర్లు, ఇతరత్రా వ్యవసాయ యంత్రాలను అందించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి రైతులకు చేసిందేమి లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ధర్నాలో ఆ పార్టీ కార్యకర్తలు తప్ప రైతులేవరు పాల్గొనలేదన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ నాయకులు అబద్దపు ప్రచారాలు, ఆరోపణలు మానుకోవాలని సూచించారు.

జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ ఎన్నిక



సాంబయ్య అధ్యక్షుడు



సుధాకర్ కార్యదర్శి

కొత్తగూడ, ఆగస్టు 23 : జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు తడకమల్ల బ్రహ్మం, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దయానంద్ సమక్షంలో జనవిజ్ఞాన వేదిక మండల కమిటీని కొత్తగూడలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుల్లం సాంబయ్య ప్రధాన కార్యదర్శిగా దూపటి సుధాకర్, కోశాధికారిగా వాసం వీరాస్వామి, గౌరవ అధ్యక్షుడిగా గుమ్మడి లక్ష్మీనారాయణ, చెకుముకి కన్వీనర్లుగా సువర్ణపాక సుబ్బారావు, తోలెం సరస్వతి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా జేవీవీ జిల్లా అధ్యక్షుడు తడకమల్ల బ్రహ్మం మాట్లాడుతూ సమాజంలోని మూఢాచారాలను రూపుమాపి, విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరిని పెంపొందించటంలో జనవిజ్ఞాన వేదిక అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు.

ఎస్సైని కలిసిన కాంగ్రెస్ అధికార ప్రతినిధి బాలునాయక్

కురవి, ఆగస్టు 23 : ఎస్సై సతీష్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి భూక్య బాలునాయక్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ కుల, మతవర్గవిభేదాలు లేకుండా అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు వద్దుల ప్రశాంత్‌రెడ్డి, గుగులోతు వేణుగోపాల్, భూక్య సురేష్, బషీరుద్దీన్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

'రుణమాఫీపై ఎర్రబెల్లి అసత్యప్రచారం'

తొర్రూరు, ఆగస్టు 23 : కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తే మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అసత్య ప్రచారం చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రైతులు, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్క రైతును కూడా పట్టించుకోని దయాకర్‌రావు రుణమాఫీపై రైతులను రెచ్చగొట్టి ధర్నాలు చేయమనడం, దానికి తాను మద్దతు తెలుపుతాననడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. దయాకర్‌రావు హాజరైన ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు తప్ప పది మంది రైతులు లేరని, ఇటీవల ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పారని, రైతులకు



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్

ఆయన క్షమాపణ చెప్పాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమరాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, నాయకులు రాంచంద్రయ్య, సదాకర్, రవీంద్రచారి, భిక్షంగౌడ్, విక్రమ్‌రెడ్డి, దొంగరి శంకర్, బిజ్జాల అనిల్, చిదిరాల రవి, జగన్, జలీల్ పాల్గొన్నారు.

జనవికాస ఆధ్వర్యంలో వైద్యశిబిరం

తొర్రూరు రూరల్, ఆగస్టు 23 : చింతలపల్లి గ్రామంలో జనవికాస ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మేరకు సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ నర్సింహ ఆస్పత్రి సహకారంతో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సెంటర్ మేనేజర్ వై.రమ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖత్, సుభాష్, కృష్ణవేణి, ప్రసన్న, రాజేష్, బాలవికాస కోఆర్డినేటర్లు శైలజ, శోభారాణి, పంచాయతీ కార్యదర్శి టి.అంజనేయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

పెద్దవంగర, ఆగస్టు 23 : రైతులందరికీ ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి.. కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, అర్హులందరికీ మాఫీచేసే వరకు రైతుల తరపున పోరాడుతామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని రాజకీయ లబ్ధిపొంది ఇప్పుడు షరతులు పెట్టి రైతులను మోసం చేస్తున్నదన్నారు. సమావేశంలో ఎఫ్‌సీఎస్ మాజీ చైర్మన్ యాదగిరిరావు, శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, దుంపల సమ్మయ్య, వెంకన్న, వెంకట్రామయ్య, రఘు, సమ్మయ్య, హరీష్, భాస్కర్, బాలు, రాజేందర్, వీరన్న, భిక్షపతి, సోమయ్య, నరసింహ, సీతారాం పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నెరవేర్చాలి

●దంతాలపల్లి : ఎన్నికల సమయంలో రైతాంగానికి ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న ఎన్నికల హామీని వెంటనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చాలని రైతులు డిమాండ్ చేశారు. స్థానికంగా మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో కూడా రైతులకు ఎలాంటి రుణ విముక్తి జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందన్న నమ్మకం ఆందోళన కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే అర్హులైన వారికి ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేసి ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. రైతులు భద్రు, వెంకన్న, హరిచంద్ర, సీతారాంనాయక్, దుర్గేష్ పటేల్ పాల్గొన్నారు.

ఎస్సీ వసతి గృహం తనిఖీ



ఎస్సీ వసతి గృహంలో సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

దంతాలపల్లి, ఆగస్టు 23 : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పెద్దముప్పారం ఎస్సీ వసతి గృహంను శుక్రవారం మండలస్థాయి అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, వసతి గృహంలో ఉండే మౌలిక వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వార్డెన్ నాగరాజు బదిలీపై వెళ్లడంతో తిరిగి నాగరాజు ఇన్‌చార్జ్ బాధ్యతలను తీసుకున్నట్లు వర్కర్లు తెలిపారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉందని స్థానికులు చెప్పడంతో ఇట్టి నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. స్థానికంగా నూతన వార్డెన్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బృందం అధికారులు విక్రమ్, అప్సరపాషా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు తూర్పుతండాలో మెగా వైద్యశిబిరం

దంతాలపల్లి, ఆగస్టు 23 : తూర్పుతండా గ్రామ నూతన పంచాయతీ కార్యాలయ భవనంలో శనివారం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మండల పంచాయతీ అధికారి అప్సరపాష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మేజర్ గిరిజన తండాగా ఉండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలక ముందే పీహెచ్‌సీ వైద్యులచే వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని తూర్పుతండా గ్రామపరిధిలోని రేఖ్యాతండా, మేఘ్యాతండా, దుబ్బతండా గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాకమల్లు

'జనాభా ప్రకారమే వాటా అడుగుతున్నాం'

తొర్రూరు, ఆగస్టు 23 : దేశంలో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారమే వర్గీకరణలో వాటా అడుగుతున్నామని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ మంద యాకమల్లు అన్నారు. తొర్రూరు పట్టణంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును, ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే వారంతా తమ ఉనికి కోసమే పోరాటం చేస్తున్నారని విమర్శించారు. మాయావతి సామాజిక న్యాయాన్ని వ్యతిరేకించిన సంఘాలు ప్రజా క్షేత్రంలో కనుమరుగవుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయని చెప్పారు. వర్గీకరణ అంశం అనేది ఎవరి హక్కులను, రిజర్వేషన్లను తీసివేసేది కాదని, తమకు రావాల్సిన న్యాయమైన వాటాను మాత్రమే కోరుకుంటున్నామని తెలిపారు. వర్గీకరణలో అభ్యంతరాలు ఉంటే వ్యతిరేకిస్తున్నవారు చర్చలకు రావాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకన్న, కుమారస్వామి, సంజీవ, మల్లేష్, భాను చందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి : ఐఎఫ్‌టీయూ

పెద్దవంగర, ఆగస్టు 23 : రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం చిన్నవంగర కేజీబీవీ పాఠశాలలో నాన్‌టీచింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌పీడీ కార్యాలయ ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న బోధన సిబ్బంది వయస్సు 65కు పెంచాలని, రిటైర్ అనంతరం రూ.5లక్షలు అందించాలన్నారు. ఈనెల 30న హైదరాబాద్‌లో జరిగే ఎస్‌పీడీ కార్యాలయ ధర్నాలో పెద్ద ఎత్తున నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా కమిటీ కార్యదర్శి ఎండీ షరీఫ్, పద్మ, సుమలత, లక్ష్మి, వెంకటమ్మ, సమతి తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

నెల్లికుదురు, ఆగస్టు 23 : మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. నెల్లికుదురులోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో శుక్రవారం చలో హైదరాబాద్ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనేతర సిబ్బంది పదవీ రమణ వయసు 65 ఏళ్లకు పెంచాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పలు సమస్యల పరిష్కారానికి ఈనెల 30న నిర్వహించే చలో హైదరాబాద్ ఎస్‌పీడీ కార్యలయం ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాండియా, బీకు, పద్మ, సుమలత, వెంకటమ్మ, సరూప, సంధ్య, లక్ష్మి, లత పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఉపాధ్యాయులకు వేతనాలు పెంచాలి

● టీపీటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి కవిత

నెల్లికుదురు, ఆగస్టు 23 : కస్తూర్బాగాంధీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలు పెంచాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయుల బదిలీలను స్వాగతిస్తున్నామని, వేతానాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. గురుకుల సంస్థలలో పనిచేసే ఉపాధ్యాయులకు ఇచ్చే వేతనాలవలే కేజీబీవీ ఉపాధ్యాయులకు ఇవ్వాలన్నారు. టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.రమేష్, వై.యాకయ్య, సంగ శ్రీనివాస్, మధూసుదన్, సలీమ్, కె.వెంకటేశ్వర్లు, నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సాంకేతికతను పెంపొందించుకోవాలి

తొర్రూరు, ఆగస్టు 23 : నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు విద్యతో పాటు సాంకేతికతను పెంపొందించుకోవాలని వికాస్ పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ అన్నారు. శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, టీచింగ్, ఎస్సే రైటింగ్, అంతరిక్ష పరిశోధన ఎగ్జిబిట్‌ల అంశాలతో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలో ఇండియా చంద్రయాన్-3 వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచ దేశాల కంటే భారతదేశం ముందుందని తెలిపారు. శాస్త్రీయతను అలవర్చుకుని ముందుకు సాగాలని సూచించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్, నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక



కొత్తగూడలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తగూడ, ఆగస్టు 23 : కొత్తగూడలోని స్పోర్ట్స్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడలకు ఎంపికైనట్టు హెచ్ఎం సారయ్య తెలిపారు. ఈసందర్భంగా సారయ్య మాట్లాడుతూ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న వి. సంతోష్, ఎస్.విజయ్ ఈనెల 18న మహబూబాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచి ఈ నెల 25, 26న మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం సారయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు కొమ్మాలు, ప్రవీణ్, కోచ్‌లు సుధీర్, ధనాజీ, హెచ్‌డబ్ల్యూవో జంపయ్య అభినందించారు

బురద నీటితో రాంవిలాస్ గల్లీ రోడ్లు

మరిపెడ, ఆగస్టు 23 : బురద నీళ్లతో రాంవిలాస్ గల్లీ రోడ్లు నిత్యం దర్శనం ఇస్తున్నా.. మునిసిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని రాంవిలాస్ గల్లీ బంగారునగల తయారీకి కేంద్రం. వ్యాపార రీత్యా నిత్యం వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. గల్లీలోని రోడ్లన్నీ గుంతలు గుంతలుగా మారాయి. వర్షపు నీరు రోజుల కొద్ది నిలిచి ఉండడంతో దుర్వాసనకు తోడు దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ఆ గల్లీ వాసులు వర్షాకాలం వచ్చిందంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీజల్ వ్యాధులతో వణికిపోతున్నారు. ఈ ఏరియాలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మోడల్ స్కూల్, కళాశాల, మాంటిస్సోరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఉండడంతో వేల మంది విద్యార్థులు ఈ గల్లీ రోడ్ల మీదుగా చేరుకుంటారు. ఈ వీధిలోని రోడ్లపై వాహనాలతో ప్రయాణం నరకం చూపిస్తుందని వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ పాలకులు, అధికారులు స్పందించి రోడ్లను మరమ్మతు చేయాలని ఆ కాలనీ ప్రజలు వేడుకుంటున్నారు.

పాత సెల్‌ఫోన్లను విక్రయించొద్దు

● ఎస్సై మురళీధర్‌రాజ్

కేసముద్రం, ఆగస్టు 23 : అపరిచిత వ్యక్తులకు పాత మొబైల్ ఫోన్లను విక్రయించవద్దని ఎస్ఐ మురళీధర్‌రాజ్ ప్రజలను కోరారు. కేసముద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొబైల్ ఫోన్ కొనుగోలు చేసిన సమయంలో అందులోని ఐఎంఈఐ నెంబరు తొలిసారి కొనుగోలు చేసిన వారిపేరున నమోదై ఉంటుందని తెలిపారు. ఫోన్ పాతబడిందని ఎవరికైనా విక్రయిస్తే వారు ఆ ఫోన్ ద్వారా సైబర్ నేరాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. దర్యాప్తు సంస్థలు ఫోన్‌ను తొలుత కొన్నవారినే విచారణ చేస్తాయని వివరించారు. ప్రజలు గమనించి తమ పాతఫోన్లను అపరిచితులకు విక్రయించవద్దని కోరారు.

రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

కేసముద్రం, ఆగస్టు 23 : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ పథకం అమలు కాని రైతుల నుంచి రెండు రోజులుగా ఫిర్యాదులను స్థానిక రైతు వేదిక భవనంలో మండల వ్యవసాయాధికారులు స్వీకరిస్తున్నారు. ఆధార్, బ్యాంకు ఖాతాల్లో పేర్లు తప్పుగా పడడం, రేషన్‌కార్డు లేకపోవడం తదితర కారణాలతో రుణమాఫీ కాకుండా రూ.2 లక్షలలోపు ఉన్న రైతుల నుంచి శుక్రవారం వరకు 144 దరఖాస్తులను తీసుకున్నట్లు ఏవో వెంకన్న తెలిపారు. రూ.2 లక్షలపైన రుణాలున్న రైతుల విషయంలో దరఖాస్తుల స్వీకరణపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని, త్వరలోనే స్పష్టత వస్తుందని తెలిపారు.



రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏవో వెంకన్న

నేడు దివ్యాంగ విద్యార్థులకు వైద్యశిబిరం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 23 : జిల్లా కేంద్రం ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలోని గుమ్ముడూరు ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో శనివారం దివ్యాంగ విద్యార్థినీ, విద్యార్థులకు క్యాంపు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలింకో ఆధ్వర్యంలో 0నుంచి 18 ఏళ్ల పిల్లలకు వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో పిల్లల వైకల్యాన్ని పరీక్షించి, అందుకు సంబంధించిన పరికరాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు తమ వెంట రెండుపాస్ ఫొటోలు (శారీరక వైకల్యం కనిపించే విధంగా), ప్రభుత్వం మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ/రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, యూడీఐడీకార్డు వెంట తీసుకురావాలన్నారు. క్యాంపునకు హాజరైన పిల్లలకు బస్ చార్జీలు, భోజన వసతి కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు.

'పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలి'

మహబూబాబాద్‌ఎడ్యుకేషన్, ఆగస్టు 23 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కంకరబోడు, మునిసిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూళ్లకు ప్రహరీలు లేకపోవడంతో రాత్రి వేళల్లో మద్యం సేవించి, బాటిళ్లు వేస్తున్నారని తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రహరీలు లేని పాఠశాలలకు నిధులు మంజూరు చేసి గోడలు నిర్మించాలని కోరారు. రాజేష్, చందు, లక్ష్మణ్, జీవన్, నరేందర్ పాల్గొన్నారు.



ఉన్నత పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

హియరింగ్ మిషన్ అందజేత

గంగారం (కొత్తగూడ), ఆగస్టు 23 : మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గంగారం మండల పెద్దఎల్లాపూర్‌కు చెందిన గుండగాని ఐలమ్మకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు హియరింగ్ మిషన్‌ను అందజేశారు. కార్యకర్తలను అన్ని విధాలుగా కాపాడుకుంటామని జాడి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాధారపు కొమురయ్య, సోషల్ మీడియా ఓ ఆర్డినేటర్ గుండగాని శ్రీధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.